పొట్ట నింపని కళ


సానేవారిపల్లిలో తోలు బొమ్మలాట ఆడుతున్న దృశ్యం


తోలుబొమ్మను తయారు చేస్తున్న కళాకారుడు

- గుర్తింపు లేక బజారున పడుతున్న కుటుంబాలు
- ప్రభుత్వ సాయం అందక ఆవేదన
- దిక్కుతోచని స్థితిలో తోలుబొమ్మ కళాకారులు

అమడగూరు: సమాజాన్ని చైతన్యపరిచేది, ప్రజలను తట్టి లేపేది కళ. అయితే దానిపై ఆధార పడిన వారు మాత్రం పొట్ట నింపుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం నుంచి తగిన సాయం, ప్రోత్సాహం అందక కళాకారుల కుటుంబాలన్నీ దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా తోలుబొమ్మలాట కళాకారుల జీవితం దుర్భరంగా మారింది. గతంలో వీరికి సమాజంలో బాగా గుర్తింపు ఉండేది. తొంభై ఆమడల దూరం వెళ్లయినా తోలు బొమ్మలాటను చూసి రావాలనే సామెత ఉండనే ఉంది. కళాకారులు ఎక్కడున్నా పిలుచుకొచ్చి గ్రామాల్లో ప్రదర్శనలిప్పించి వారికి తగిన పారితోషికం ఇచ్చి పంపేవారు. అలా చేయడం వలన వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయని ప్రజల ప్రగాఢ విశ్వాసం. అయితే రానురాను సినిమాలు, టీవీలు.. తాజాగా ఆండ్రాయిడ్ మొబైల్స్, యూ ట్యూబ్, సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైన తరుణంలో కళాకారులకు ప్రాధాన్యం బాగా తగ్గిపోయింది.

గ్రామాల్లో తోలు బొమ్మలాట ఆడుకుంటూ..

ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలో సుమారు 70 కుటుంబాలకు తోలు బొమ్మలాట కళాకారులు ఉన్నారు. వారిలో కొంతమంది అమడగూరు మండలానికి వచ్చి గ్రామాల్లో తోలు బొమ్మలాట ఆడుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల మామిడిమాకులపల్లి, గువ్వలపల్లి, సానేవారిపల్లి, బాలప్పగారిపల్లి గ్రామాల్లో గ్రామపెద్దల ఆమోదంతో తోలు బొమ్మలాట నిర్వహించారు. గ్రామంలో బొమ్మలాట ఆడాలంటే కనీసం 60 నుంచి 70 మంది వేషధారణలతో కూడిన బొమ్మలు తయారు చేయాల్సి ఉంటుంది. అలాగే కనీసం ఏడుగురు ఉంటేనే ప్రదర్శన ఇవ్వగలరు. ఆటకు రూ.10 వేలు వస్తే కూలీ గిట్టుబాటు అవుతుందని కళాకారులు చెబుతున్నారు.

కళాకారులకు పింఛన్ ఇవ్వాలి



ప్రభుత్వం సమాజంలోని అన్ని రకాల కళాకారులను గుర్తించి వారిని ఆదుకునేలా పింఛన్ మంజూరు చేయాలి. అంతరించి పోతున్న కళాకారుల్లోని ప్రతిభను వెలికితీయాలి. కళాకారులకు ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు కల్పించాలి. గతంలో రైతులే అన్ని రకాల తిండి గింజలను ఇచ్చి కళాకారులకు గౌరవం ఇచ్చేవారు.

– వెంకటరెడ్డి, సోలుకుంట్ల

ప్రభుత్వ ప్రోత్సాహం లేదు



ప్రస్తుతం కళాకారులకు ప్రభుత్వం నుంచి ఏమాత్రం సాయం, ప్రోత్సాహం లభించలేదు. కళలనే నమ్ముకున్న కళాకారులు ఇతరత్రా పనులను చేయలేరు. సమాజం, ప్రభుత్వం కళాకారుల కుటుంబాలను పట్టించుకోవడం లేదు. కళాకారుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి వారి మనుగడకు చర్యలు తీసుకోవాలి.

– శంకరప్ప, కళాకారుడు

ప్రభుత్వమే ఆదుకోవాలి



రైతన్నలే పంటకు పెట్టిన పెట్టుబడులు అందక సతమతమవుతున్నారు. ప్రభుత్వమే కళాకారులను ఆదుకోవాలి. కళాకారులకు ప్రత్యేక సబ్సిడీ రుణాలను ఇచ్చి బతుకుతెరువును కల్పించాలి. కళలను గుర్తించేలా అవగాహనా కార్యక్రమాలు చేయించాలి. కళాకారులు లేకుంటే సమాజంలో సంతోషం కరువైపోతుంది.

– భాగమ్మ, కళాకారిణి

రామాయణానికి ప్రత్యేకత..

తోలు బొమ్మలాటలో రామాయణ పర్వానికి ప్రత్యేకత ఉంది. రామాయణంలో ముఖ్యంగా సుందర కాండ, లంకాదహనం, మయరాముని చరిత్ర, సతీ సులోచన, ఇంద్రజిత్ యుద్ధం, రావణ వధ వంటి ప్రత్యేక కథలు చూపరులను ఆకట్టుకుంటాయి. ఈ కథల్లో ముఖ్యంగా శ్రీరాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుడు, రావణాసురుడు, వాలి, సుగ్రీవుడు, లంకిణి పాత్రలు గ్రామస్తులను కట్టిపడేశాలా ఉంటాయని కళాకారుల పేర్కొంటున్నారు.

ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై నిలదీత


అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌ను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు జయరామకృష్ణారెడ్డి

గాండ్లపెంట: మండల పరిషత్‌కు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులు ఏమయ్యాయంటూ గాండ్లపెంట ఎంపీటీసీ ఖమర్‌జహాన్, జెడ్పీ కోఆప్షన్‌సభ్యుడు ఫయాజ్‌అలీ, కురుమామిడి సర్పంచ్ సుధాకర్ అధికారులను నిలదీశారు. మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏడుగురు ఎంపీటీసీలకు రావాల్సిన నిధులను తీర్మానం లేకుండా ఏకపక్షంగా నిధులు మంజూరు చేశారని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. గాండ్లపెంట ఎంపీటీసీకి రూ.4 లక్షల నిధులు రావాల్సి ఉన్నా ఇవ్వలేదన్నారు. రెక్కమాను, పాయకట్లులో నీటి ఎద్దడి నివారణకు నిధులు ఖర్చు చేసి ఏడాది గడిచినా బిల్లు మంజూరు చేయలేదని కురుమామిడి సర్పంచ్ సుధాకర తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. తుమ్మలబైలు పెద్దతండాలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వడంలో ఏఈ నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచ్ రవీంద్రనాయక్ తెలిపారు. పలు శాఖల అధికారులు సభకు గైర్హాజవడంపై సభ్యులు మండిపడ్డారు. ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, వైద్యాధికారి మహేశ్వరమారుతి, ఎంఈఓ క్రిష్టానాయక్, పశుసంవర్థశాఖ వైద్యాధికారి కేశవనాయక్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు, ఆర్‌బ్ల్యూఎస్ ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యూటీఎఫ్ క్రీడల్లో టీచర్ల ప్రతిభ


సత్యసాయి జిల్లా టీచర్లకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి యూటీఎఫ్ స్వర్ణోత్సవాల క్రీడా పోటీల్లో సత్యసాయి జిల్లా టీచర్లు ప్రతిభ చూపారు. గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లా టీచర్లు సీతామహాలక్ష్మి, సబిహాభానులు తొలి రెండు స్థానాల్లో నిలిచినట్లు శ్రీసత్యసాయిజిల్లా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ శనివారం తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెం విభాగంలో నరేష్‌కుమార్ తృతీయస్థానం, 400 మీటర్ల నడక విభాగంలో ద్వితీయ స్థానంలో శరణు ముకేంద్ర నిలిచారన్నారు. విజేతలకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కలందర్, ప్రచురణల కమిటీ ఛైర్మన్ హనుమంతరావు సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు.


కదిరి టౌన్: గౌరిదేవి రూపంలో చౌడేశ్వరి అమ్మవారు


పుట్టపర్తిలో శాకంబరిగా దర్శనమిస్తున్న సత్తెమ్మ దేవత


బత్తలపల్లి : అన్నపూర్ణాదేవిగా లలితా త్రిపుర సుందరి

అన్నపూర్ణా దేవీ పాహిమాం!

సాక్షి బృందం: పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు సందడిగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయాల్లో అమ్మవారి మూలవిరాట్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


కదిరి టౌన్: మధుర మీనాక్షి అలంకారంలో వాసవీమాత


కదిరి టౌన్: గాయత్రీదేవి అలంకారంలో మహాలక్ష్మి


ముదిగుబ్బ: వేంకటేశ్వరుడి అలంకరణలో వాసవీమాత


కనగానపల్లి: అన్నపూర్ణాదేవిగా సల్లాపురమ్మ దేవత


ధర్మవరం అర్బన్: బాలత్రిపుర సుందరిదేవిగా పద్మావతి


ధర్మవరం అర్బన్: మోహినిదేవి రూపంలో కన్యకాపరమేశ్వరి

స్త్రీ చైతన్యమే సమస్యల పరిష్కారానికి మార్గం


సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది నరసింహులు

నల్లమాడ: స్త్రీ చైతన్యమే సమస్యల పరిష్కారానికి మార్గమని వక్తలు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయవాదులు కదిరి నరసింహులు, లింగాల లోకేశ్వర్‌రెడ్డి అనుసంధానకర్తలుగా వ్యవహరించిన సదస్సుకు లేబర్ అధికారి జహీరుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ సునీత, రెడ్స్ సంస్థ అధ్యక్షురాలు భానుజా హాజరయ్యారు. అనుసంధానకర్తలు సమాజంలో మహిళల పాత్ర, వారి రక్షణ కోసం తెచ్చిన చట్టాలను తెలియపర్చారు. గృహహింస, వరకట్న, లైంగిక వేధింపులు, సమాన పనికి సమాన వేతనం, మహిళల అక్రమ రవాణా, యాసిడ్ దాడులు, హత్యలు, అత్యాచారాలు, మహిళల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

బత్తలపల్లి: పొలంలో రస్తా కోసం జరిగిన ఘర్షణకు సంబంధించి ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పత్యాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు చంద్రశేఖర్‌రెడ్డి, నాగశేషణరెడ్డికి వీరి దాయాది చెన్నకేశవరెడ్డికి పొలం హద్దులు, రస్తాల విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై శుక్రవారం రాత్రి ఇరువర్గాలు దాడులకు దిగాయి. ఘటనలో ఇరు వర్గాలకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, నాగశేషణరెడ్డి, చెన్నకేశవరెడ్డి, ఆదినారాయణమ్మ, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు


77 పరుగులతో సత్తా చాటిన కార్తీక

ధర్మవరం రూరల్: ఆర్డీటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న బాలికల అండర్–16 రూరల్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం హిందూపురం జట్టు, ధర్మవరం జట్లు తలపడ్డాయి. తొలుత హిందూపురం జట్టు 30 ఓవర్లలో 165 పరుగులు చేసింది. ఇందులో కార్తీక 77 పరుగులతో సత్తా చాటింది. అనంతరం ధర్మవరం జట్టు 19 ఓవర్లలో 3 వికెట్లను కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. ధర్మవరం జట్టులో హస్మిత 55 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడింది. ధర్మవరం ఏరియా టీం లీడర్ శ్రీనివాసులు, కోచ్ రాజశేఖర్ పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకే రుణాలు

నల్లచెరువు: ఏడీసీసీ బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నట్లు మేనేజర్ మహాలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక సొసైటీ కార్యాలయంలో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సీఈఓ మల్లికార్జున రెడ్డి,సెక్రటరీలు లక్షిపతి నాయుడు,శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన


చీనీ పంటలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

ధర్మవరం రూరల్: కుణుతూరు క్లస్టర్ పరిధిలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు, ఈకేవైసీ శనివారం ఆర్డీఓ మహేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగు విస్తీర్ణం, నమోదు వివరాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతు ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులంతా తప్పని సరిగా ఈకేవైసీని చేయించుకోవాలన్నారు. ఏఓ ముస్తఫా, సిబ్బంది త్రినాథ్, శ్రీనివాసులు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత అగ్రికల్చర్ జట్టు


ట్రోఫీ అందుకుంటున్న అగ్రికల్చర్ జట్టు

పుట్టపర్తి అర్బన్: బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతగా అగ్రికల్చర్ జట్టు నిలిచిందని డీన్ డాక్టర్ రాంగోపాల్ మోపూరి, రిజిస్ట్రార్ జైప్రకాష్ తెలిపారు. వర్సిటీలో వారం రోజులుగా క్రికెట్ టోర్నీ నిర్వహించారు. శనివారం జరిగిన ఫైనల్‌లో దేవీశ్రీ ప్రసాద్ ఇంజినీరింగ్ జట్టుపై యువరాజ్ అగ్రికల్చర్ జట్టు విజయకేతనం ఎగురవేసింది. విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

పుట్టపర్తి టౌన్: ప్రశాంతి గ్రాం సచివాలయంలో సీహెచ్ఓ నగేష్ గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భగా సీహెచ్ఓ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు గఫూర్, అనిత, అమృత పాల్గొన్నారు.

మండల సమాఖ్య వార్షిక సమావేశం

గాండ్లపెంట: స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఏడాది ప్రణాళిక, బడ్జెట్‌ను ఆమోదించారు. సమాఖ్య కొత్త అధ్యక్షురాలిగా నూర్జహాన్, ఉపాధ్యక్షురాలిగా సుజాత, కార్యదర్శిగా మౌనిక, సంయుక్త కార్యదర్శిగా అఖిలాబాను, కోశాధికారిగా సరితలను ఎన్నుకున్నారు. ఏపీఎం సూర్యనారాయణ, స్త్రీనిధి ఏజీఎం వేణు, సీసీలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

ఎన్పీకుంట: పి కొత్తపల్లి పంచాయతీలో వర్షానికి దెబ్బతిన్న వేరుశనగ పంటను శనివారం ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎకరాకు సుమారు రూ.25 వేలు ఖర్చు చేశామని, ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూడాలని ఏఓను కోరారు.

క్లుప్తంగా

పుట్టపర్తి అర్బన్ ఎస్ఐగా శ్రీరాములు



పుట్టపర్తి టౌన్: స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా శ్రీరాములు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్ఐకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఏఎస్ఐగా పనిచేశానని శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు చేపడతానన్నారు.

వేరుశనగ పంటకోత ప్రయోగాలు


పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వర్షాధార పంటగా సాగు చేసిన వేరుశనగ పంటలో అధికారులు పంటకోత ప్రయోగాలు చేపట్టారు. శనివారం సంజీవపురం గ్రామంలో సర్వే నంబర్ 52లో ముల్లగూరు సంజీవు సాగు చేసిన వేరుశనగ పంటలో పంటకోత ప్రయోగం చేపట్టగా 3.5 కేజీల దిగుబడి వచ్చిందని మండల గణాంక అధికారి డాక్టర్ కేఎల్ లక్ష్మీనరసింహశర్మ తెలిపారు. ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీఏఏ నిఖితకుమారి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎనుములపల్లి విద్యార్థులు


రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: ఎనుములపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సుధాకర్, పీడీ రమేష్‌బాబు శనివారం తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో పాఠశాల విద్యార్థిని గౌతమిని అండర్–14, కౌశిక్‌రెడ్డి, విజయను అండర్–17 జట్టుకు నిర్వాహకులు ఎంపిక చేశారు. వీరు త్వరలో పశ్చిమగోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను హెచ్ఎం, పీఈటీ అభినందించారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న అటవీశాఖ అధికారి దామోదర్

గాండ్లపెంట: వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక ఆదర్శ ఆంగ్లమాధ్యమం పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అటవీశాఖ సెక్షన్ అధికారి దామోదర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రపంచంలో మనుషులతో సమానంగా ప్రతి జీవికి జీవించే హక్కు ఉందన్నారు. వన్యప్రాణులను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మల్లికార్జున, బీట్ అధికారి కుళ్లాయప్ప, బ్రహ్మయ్య, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: వన్య ప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హుసేనప్ప తెలిపారు. స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్, ఎన్ఎస్ఎస్ విభాగం, బుక్కపట్నం అటవీశాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ పీఓ గోపాల్‌నాయక్, ఫిజిక్స్ విభాగాధిపతి పావని, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓకు అభినందనలు


ఎంపీడీఓను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

గాండ్లపెంట: ఇటీవల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటరామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఎంపీపీ గంగోజమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ,కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ లక్ష్మీనరసింహాగౌడ్ ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. మాజీ డైరెక్టర్లు మేకల నరసింహులు, ఫారుక్, నాయకులు పామిడి ఇక్బాల్, హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రవీంద్రనాయక్, సూర్యశేఖరరెడ్డి, ఆంజనేయులు నాయక్, గోపాల్‌నాయక్, చంద్ర,ఆజాద్ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న జడ్జి జయలక్ష్మి

కదిరి టౌన్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.జయలక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం కోర్టు ఆవరణలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగేంద్రరెడ్డి, న్యాయవాదులు లింగాల లోకేశ్వర్‌రెడ్డి, బైరవప్రసాద్, జాఫర్‌ఖాన్, రమేష్‌నాయుడు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

తాడిమర్రి: ఇటీవల మరమ్మతు చేపట్టిన రెండవ అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సీడీపీఓ సరస్వతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ఆహార పదార్థాలను సక్రమంగా అందించాలన్నారు. సర్పంచ్ బండారు బాలమ్మ, సూపర్‌వైజర్లు లలితమ్మ, చంద్రమ్మ, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


ఎస్ఐ దాదాపీర్‌తో వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లమాడ: ఇటీవల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన దాదాపీర్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్పీటీసీ ఎస్. రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ అగిశం ప్రతాప్, సర్పంచ్‌లు కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, నాగరాజునాయుడు, నరసింహమూర్తి ఎస్ఐను కలిసి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇస్తున్న ఉపాధ్యాయులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం సన్మానించారు. కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోచింగ్ ఇస్తున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. అంతక ముందు ఆయన పాఠశాలలో కందికుంట నారాయణమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. వైదేహి సూపర్ స్పెషాలిటీ అనుపత్రి డాక్టర్లు క్యాన్సర్, గుండెజబ్బు, కిడ్నీ, ఎముకలు,బీపీ, షుగర్ తదితర రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి, జెడ్పీహైస్కూల్ హెచ్ఎం వెంకటాచలం, ట్రస్ట్ ఆర్గనైజర్ నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి



ఓడీచెరువు: ఓడీచెరువు ఎస్ఐగా బి.మల్లికార్జునరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. కనగానపల్లిలో పని చేస్తున్న ఈయన బదిలీపై ఇక్కడికొచ్చారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పుట్టపర్తి డీఎస్పీగా విజయకుమార్

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి డీఎస్పీగా విజయకుమార్‌ను నియమిస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేసిన డీఎస్పీ వాసుదేవన్‌ను నెల రోజుల క్రితం వీఆర్‌కు పంపారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ డీఎస్పీగా శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. నూతన డీఎస్పీ త్వరలో బాధ్యతలు చేపట్టునున్నట్లు సమాచారం.

భక్తులకు అన్నదానం

అమడగూరు: తుమ్మల కొండపై వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు శనివారం చింతా శివారెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చింతా శరత్‌కుమార్‌రెడ్డి, సభ్యులు శ్రీనివాసులు, రామచంద్ర, సరళమ్మ, ఆదిమూర్తి, పూజారి రమణ, నరేష్‌కుమార్‌రెడ్డి, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.